క్లుప్తంగా

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 35, బెండ 32, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 14, క్యారెట్ 40, దొండ 18, ఆలు 20, ఉల్లి 12, గోకర 45, దోస 13, సొర 11, పొట్ల 10, అరటి 10, చిక్కుడు 55, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 45, బీట్‌రూట్ 23, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 55. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

తూర్పుగూడేనికి బస్ సర్వీస్ ప్రారంభం



నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ కృష్ణమూర్తి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపో నుంచి తుంగతుర్తి మీదుగా తూర్పుగూడెంకు నూతన ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌ను గురువారం డిపో మేనేజర్ కె.కృష్ణమూర్తి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ, దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి చౌటుప్పల్, నకిరేకల్ మీదుగా తుంగతుర్తి-తూర్పుగూడెం చేరుకుంటుందన్నారు. తూర్పుగూడెంలో నైట్‌హాల్ట్ అయి తిరిగి ఉదయం 5 గంటలకు అక్కడ నుంచి బయలు దేరి 8.30 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ కొత్త రూట్ బస్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలో పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, స్వస్తివచనం, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహ వచనం, రక్షా సూత్ర ధారణ, అంకురార్పణ నిర్వహించారు. సప్పా భారతి భాగవతారిణిచే శ్రీనివాస్ కల్యాణం-హరికథ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వారణాసి వంశీ, అనంతుల సురేందర్ రెడ్డి, హేమసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దు

బడంగ్‌పేట మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని పలు డివిజన్లలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను జంగిల్ కటింగ్ చేయించారు. కాలనీల్లోని రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చివేయించారు. లీకేజీలున్న డ్రైనేజీలకు మరమ్మతులను చేయించారు. 22, 28 డివిజన్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మేయర్ మాట్లాడుతూ.. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవద్దని కాలనీవాసులకు సూచించారు. స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి, కాలనీలకు చెత్త సేకరణకు వస్తున్నాయని అందులో వేయాలని సూచించారు. డ్రైనేజీలు ఎక్కడైన నిండుకున్నా స్థానిక కార్పొరేటర్‌కు తెలియచేస్తే సిబ్బంది వచ్చి క్లీన్ చేస్తారని అన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్లగంటి అర్జున్, లిక్కి మమత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ (2023-24) బ్రోచర్‌ను గురువారం కళాశాల అభివృద్ధి కమిటీ మెంబర్ పెద్దబావి ఆనంద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక, అధ్యాపకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడంగ్‌పేటలోని డిగ్రీ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. పీహెచ్‌డీ అర్హత కలిగిన బోధనా సిబ్బందితో పాటు చక్కని ల్యాబ్ వసతి అందుబాటులో ఉందని అన్నారు. కాలేజీకి చేరుకోడానికి అన్ని రూట్లనుంచి బస్ సౌకర్యం ఉందని అన్నారు. ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో చేరి ఆర్థికంగా నష్టపోవద్దని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల తల్లితండ్రులకు సూచించారు. ఇక్కడ అడ్మిషన్‌తో పాటు అన్ని సేవలు ఉచితంగా లభిస్తాయన్నారు. బ్రోచర్ విడుదల చేసిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ బి.అనిల్‌కుమార్, అధ్యాపకులు చందోజీరావు, డా.కరీముల్లా, డా.విజయ్‌కుమార్, నరసింహరాజు, సిబ్బంది ఆనంద్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

పూర్తికాని వరద కాలువ పనులు

ముంచుకొస్తున్న ముంపు ముప్పు

- శారదానగర్ కాలనీ సమీపంలో నిలిచిన పైప్‌లైన్ పనులు
- స్థలం ఇచ్చేందుకు సహకరించని యజమానులు

వనస్థలిపురం: వర్షాకాలం ముంచుకొస్తోంది.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వరదనీటి కాలువల పరిస్థితి ఉంది. పలు కాలనీల్లో వరదనీటి కాలువలు పూడికతీతకు నోచుకోక, వరదనీరు దిగువకు వెళ్లడానికి సరైన అవుట్‌లెట్ నిర్మాణాలు జరుగక పూర్వంలాగే ఉన్నాయి. దీంతో రాబోయే వర్షాకాలంలో వరద, మురుగు నీరు వెళ్లడానికి సరైన వ్యవస్థ లేక తమ కాలనీలు ఎక్కడ ముంపు బారిన పడతాయోనని పలు కాలనీల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

- హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్, ఫేజ్-3లోని మోహినీ ఎన్‌క్లేవ్ కాలనీలు వనస్థలిపురం, తదితర ఎగువన ఉన్న కాలనీల నుంచి వచ్చే వరద నీటితో ఏటా ముంపు బారిన పడుతున్నాయి.
- దీని నివారణకు శారదానగర్ నుంచి నర్సింహారావునగర్ కాలనీ పక్కగా హయత్‌నగర్ కుమ్మరి కుంట చెరువులో వరదనీరు కలిసేలా గతంలోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వరదనీటి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- శంకుస్థాపన చేసి ఏడాది అవుతోంది. ఎగువన, దిగువన పనులు పూర్తయినా శారదానగర్ సమీపంలో ఉన్న భూ యజమానులు తమ భూమిలో నుంచి అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ వేయడానికి సహకరించక పోవడంతో వరద కాలువ పనులు అలాగే నిలిచిపోయాయి.

టీడీఆర్ ఇచ్చినా ససేమిరా...

శారదానగర్ సమీపంలో ఉన్న భూమికి సంబంధించి ఓ బీజేపీ నాయకుడు తన భూమిలో నుంచి పైప్‌లైన్ వేయడానికి సహకరించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు వారితో చర్చించి వారు కోరుకున్న విధంగా టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) మంజూరు చేయడానికి అంగీకరించినా సదరు నాయకుడు సంబంధిత పత్రాలను అందజేయకపోవడంతో పనులు పురోగతి సాధించలేక పోయాయి.

- ఇదిలా ఉండగా, శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాలలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వరద, మురుగు నీరు వెళ్లడానికి సరైన వ్యవస్థ లేని పరిస్థితుల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాల నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



శారదానగర్ కాలనీ చివర వరకు నిర్మాణం జరుపుకుని ఆగిపోయిన వరద కాలువ



శారదానగర్ కాలనీ దిగువన వరద కాలువ నిర్మించాల్సిన స్థలం

వరద కాలువ పూర్తికి చర్యలు తీసుకోవాలి



వర్షాకాలంలో శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ చాలా ఏళ్లుగా వరద ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువ నిర్మాణం పనులు చాలా వరకు పూర్తయినా శారదానగర్ దిగువన ఉన్న స్థలంలో సంబంధిత యజమానులు సహకరించక పోవడంతో పనులు నిలిచిపోయాయి. వర్షాకాలం సమీపిస్తున్నందున ఈ విషయంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకుని వరద కాలువ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి. కాలనీలను వరదముంపు నుంచి కాపాడాలి.

– కేఎల్ నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి, శారదానగర్

వీరన్నగుట్ట సుందరీకరణకు రూ.13.75 కోట్లు: ఎమ్మెల్యే



వీరన్నగుట్ట దివ్యక్షేత్ర సరిహద్దులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి

మన్సూరాబాద్: వీరన్నగుట్ట సుందరీకరణకు రూ.13.75 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టను హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, హెచ్ఎండీఏ ఈఈ ముంతాజ్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వీరన్నగుట్ట ఆలయం చుట్టూ 6.5 ఎకరాల స్థలంలో పెద్ద దివ్యక్షేత్రం, రాక్‌గార్డెన్ నిర్మిస్తామన్నారు. పక్కన ఉన్న 3.5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కూడా ఆలయానికి కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరామన్నారు. శివరాత్రి పర్వదినానికి లక్షమంది భక్తులు భగవంతుడ్ని దర్శించుకునే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. కొండపైకి వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డును, మెట్లను ఆధునీకరిస్తామన్నారు. కొండపైనే వాహనాల పార్కింగ్‌కు సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. హయత్‌నగర్ తహసీల్దార్ ఆలయ సరిహద్దులు గుర్తించేందుకు పరిశీలనకు వచ్చారని, వారు గుర్తించి హద్దులు ఏర్పాటు చేయగానే ప్రహరీ నిర్మాణ పనులు మొదలవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీష్‌యాదవ్, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, ఆనంద్‌యాదవ్, కేపీఎల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో బంబ్ సింగి భవన్ ప్రారంభం



భవన ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్‌నగర్‌లో కొత్త నిర్మించిన 'బంబ్ సింగి భవన్'ను గురువారం మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమానికి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్ యాదవ్ హాజరయ్యారు. శ్రమన్ సంఘ్ యువచార్య మహేందర్ రుషీజీ, పండిత్ రత్నఖ్యాన్ మునిమహారాజ్, కపిల్ మునిమహారాజ్, శృతి మునిమహారాజ్, ఇందుబాలాజీలు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో సింగి పరివార్ ప్రతినిధులు సురేందర్‌కుమార్, రాజేంద్రకుమార్, మహేంద్రకుమార్, విజయ్‌రాజ్, గిరిరాజ్, యోగేష్, నితేష్, మలక్‌పేట జైన్ శ్రీసంఘ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవులకు ఆరోగ్య గుర్తింపు కార్డుల అందజేత



ఆరోగ్య గుర్తింపు కార్డులను ప్రదర్శిస్తున్న కేవీ రమణాచారి, వేణుగోపాలాచారి తదితరులు

మన్సూరాబాద్: శ్రీవైష్ణవ కులస్తులకు కొన్ని ఆరోగ్య సేవలు ఉచితంగా, మరికొన్ని తక్కువ ఫీజుతో అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ చొరవ చూపడం సంతోషకరమని బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలా చారి అన్నారు. మన్సూరాబాద్ చంద్రపురి కాలనీలోని శ్రీవైష్ణవ సేవా సదనంలో శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ ఆధ్వర్యంలో శ్రీవైష్ణవ కులస్తులకు ఆరోగ్య కార్డులు గురువారం వారు ముఖ్యఅతిథులుగా హాజరై అందజేశారు. గుర్తింపు కార్డులను సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ అధ్యక్షుడు ఎస్వీ చారి, డాక్టర్ ఏవై చారి, డాక్టర్ టీవీ శ్రీనివాస్, కె.యాదగిరి చారి, సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

31న బ్రాహ్మణ పరిషత్ భవనం ప్రారంభోత్సవం

మన్సూరాబాద్: బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 31న ప్రారంభిస్తారని నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి తెలిపారు. గురువారం ఎల్‌బీనగర్ శ్రీవైష్ణవ సేవా సదనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలోని జర్నలిస్టు కాలనీ సమీపంలోని గోపనపల్లి వద్ద రూ.18కోట్ల విలువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్‌కు కేటాయించిందని, మరో రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణం చేశారని తెలిపారు. మూడంతస్తుల్లో నిర్మించిన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న బ్రాహ్మణ సంఘం పెద్దలు, పీఠాధిపతులు, వేద పండితులు, ప్రధాన ఆలయాల ప్రధాన అర్చకులు ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు. బ్రాహ్మణ, శ్రీవైష్ణవ, కరణంతో పాటు అన్ని శాఖలకు చెందిన ప్రతినిధులను భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తున్నట్లు వారు వెల్లడించారు.

యువతి ఆత్మహత్య

నాగోలు: చీరతో ఉరేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..హస్తినాపురంలో నివాసం ఉండే పత్తికొండ రేణుకకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త శ్రీధర్‌రెడ్డి కొత్తకాలం క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. వీరి చిన్నకుతూరు రిషిత(18) ఇటీవలే ఓ కార్పొరేటర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. ఇదిలా ఉండగా, బుధవారం ఇంట్లో తమ్ముడు హరీశ్‌తో ఉన్న రిషిత రాత్రి సమయంలో మరో గదిలోకి వెళ్లి పడుకుంది. గురువారం ఉదయం బెడ్‌రూమ్ నుంచి ఎంతకు బయటకు రాకపోవడంతో ఇంట్లో వారు తలుపులు తట్టారు. డోర్ తీయకపోవడంతో చుట్టపక్కల వారి సహాయంతో కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా, డోర్ హ్యాంగర్‌కు చీరతో ఉరేసుకొని రిషిత కనిపించింది. డోర్ పగులగొట్టి కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె చనిపోయి ఉంది. తన కూతురు మానసిక సమస్యతో బాధపడుతూ ఆత్మహత్యకు చేసుకున్నట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

దేవతలగుట్టపై 'స్వేరోస్ విక్టరీ డే' సంబురాలు



స్వేరోస్ జెండాలతో చిన్నారులు, ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గురువారం స్వేరోస్ విక్టరీ డే సంబురాలు జరుపుకున్నారు. డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సహకారంతో ప్రపంచంలో అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి గురుకుల పాఠశాల విద్యార్థులు మలావత్ పూర్ణ, సాధనపల్లి ఆనంద్ కుమార్ దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకువచ్చారు. మే 25, 2014ను గుర్తుకు చేసుకుంటూ బాలాపూర్‌లోని స్వేరో సర్కిల్ చిన్నారులు ఈ ప్రాంతంలో ఎత్తైన దేవతలగుట్టను ఎక్కి మలావత్‌పూర్ణ, ఆనంద్‌కుమార్ సాధించిన ఘనతపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు 11కేవీ రాక్‌హిల్స్, వీ-గార్డ్, శ్రీనివాసకాలనీ, సాయినగర్, గౌటేటి ఫంక్షన్‌హాల్ ఫీడర్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పార్కుల సమగ్రాభివృద్ధికి కృషి



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పార్కులను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని దత్తానగర్ కాలనీలోని పార్కు అభివృద్ధిలో భాగంగా బోరు వేసే పనులను కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న పార్కుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముందు చూపుతో నిధులను మంజూరు చేయించి పనులు చేయిస్తున్నారన్నారు. దత్తానగర్ కాలనీలో ఏర్పాటు చేసే పార్కు పనులకు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ వారిచే ఎమ్మెల్యే రూ. 85 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఏఈ జీవన్‌రెడ్డి, దత్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గోషాల్, అభిషేక్, కనకదుర్గ, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పద్మిని, ఆదిలక్ష్మి, రోహిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. బీజేపీ హైదరాబాద్ కార్యాలయంలో నిర్వహించిన భాగ్యనగర్ జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు పార్టీ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని భాగ్యనగర్ జిల్లా పరిధిలో విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని నియోజకవర్గాల పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. దశాబ్దాలుగా పార్టీ పటిష్టతకు కృషి చేసి ప్రస్తుతం సానుభూతిపరులుగా ఉన్న పాత తరం నాయకులతో సైతం సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జిల్లా పరిధిలో పార్టీ గెలుపునకు నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పెండెం లక్ష్మీనారాయణ, ప్రకాష్‌రెడ్డి, ఆలె భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ఎల్‌బీసీ చిన్న కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోనిఎల్‌బీసీ చిన్న కాలనీలో కార్పొరేటర్ గురువారం పర్యటించారు. కాలనీలోని అంతర్గత రహదారులపై మురుగు పారుతోందని స్థానికుల ద్వారా గత పర్యటనలో తెలుసుకున్న కార్పొరేటర్ అదనపు మ్యాన్‌హోళ్లు నిర్మించాలని జలమండలి అధికారులను ఆదేశించగా, వారు మ్యాన్‌హోళ్లను నిర్మించారు. ఆయా నిర్మాణాలను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిత్యం డివిజన్ పరిధిలో పర్యటిస్తూ స్థానికుల ద్వారా సమస్యలు తెలుసుకొని వాటిని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ శ్రవణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సుభాష్ చందర్, అనిల్ పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



పవనగిరి కాలనీ ఫేజ్-3 వాసులతో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నానని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి పవనగిరి కాలనీ ఫేజ్-3లో కార్పొరేటర్ గురువారం మార్నింగ్‌వాక్ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి పెంచి అభివృద్ధి పనుల్లో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాలనీవాసులు హరినాథ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సంపత్, నర్సింహుడు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులతో పాత్రికేయులకు మేలు: ఉప్పల



మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే మీడియా ప్రధాన కర్తవ్యమని, ఆ దిశగా పాత్రికేయులంతా కృషి చేయాలని తెలంగాణ పర్యాటక శాఖ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో మీడియా నిర్వర్తించిన పాత్ర ఎనలేనిదని, తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అన్నివేళలా అండగా నిలుస్తోందన్నారు. గురువారం నాగోల్‌లో డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డీజేఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల శిక్షణ సంస్థ «శైలి» తరగతుల ప్రారంభ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులు తమ వృత్తిలో రాణించడానికి డీజేఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్దార్ పుటం పురుషోత్తం మాట్లాడుతూ, జర్నలిస్టులకు శిక్షణ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అవుల రామారావు, డీజేఎఫ్ జాతీయ గౌరవాధ్యక్షుడు పోలిశెట్టి విశ్వనాథ్, డీజేఎఫ్ జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి, డీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాసం రత్నాకర్ పటేల్, కొంతం యాదిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస రావు జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నారగోని శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: యాదవులను, యాదవజాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవ్‌జాతికి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు క్షమాపణ చెప్పాలని జాతీయ యాదవహక్కుల పోరాటసమితి ప్రధాన కార్యదర్శి నారగోని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. లేకుంటే గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు తరలి వెళ్తూ హస్తినాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ్‌జాతిని కించపరిచే హక్కు రేవంత్‌రెడ్డికి ఎవరిచ్చారని, ఇతర కులాలను కించపరిచే రేవంత్‌రెడ్డికి తెలంగాణలోని యాదవులందరూ తగిన విధంగా బుద్ధిచెప్పి తీరాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణలోని యాదవజాతికి బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే రేవంత్‌రెడ్డిని అడుగడుగునా అడ్డుకుంటామని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో సాయియాదవ్, యాదవ ప్రతినిధులు పాల్గొన్నారు.